# పేదల ఆత్మబంధువు

## హరీశ్‌రావు రాక

- నేడు 'పేట', వనపర్తి జిల్లాల్లో పర్యటన
- అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- కోస్గి, మక్తల్, కొత్తకోటలో సభలు



మక్తల్‌లో ఏర్పాటు చేసిన సభాస్థలి



మహబూబ్‌నగర్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : గతంలో దవాఖానలకు పోవాలంటే.. 'నేను రాను బిడ్డో.. సర్కారు దవాఖాన'కు అన్న రోజులు ఉండేవి. ప్రైవేటు దవాఖానలకు వెళ్లాలంటే జేబులు గుల్ల అయ్యేవి. కానీ తెలంగాణ ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ హయాంలో వైద్యరంగం ఎంతో అభివృద్ధి చెందింది. దీంతో ఆనాటి నానుడి కనుమరుగైపోయింది. నూతన భవనాలు, దవాఖానల స్థాయి పెంపు, వసతులు, 24 గంటలు అందుబాటులో వైద్యులు, సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలను విస్తరించేందుకు ప్రభుత్వం పల్లెదవాఖానలు, పట్టణాల్లో బస్తీ దవాఖానలు వెలిశాయి. అంతేగాక ప్రతి మండల కేంద్రంలో కనీస 30 పడకల స్థాయిలో వసతులు కల్పించారు. దీంతో ప్రభుత్వ వైద్య సేవలపై భరోసా పెరిగి దవాఖానలకు క్యూ కడుతున్నారు. గతంలో ఉమ్మడి జిల్లాలో విసిరేసినట్లు ఉండే దవాఖానలను ఇప్పుడు ప్రజలకు అవసరమున్న చోట నిర్మిస్తున్నారు. ప్రభుత్వ సహకారంతో పేదలకు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఆత్మబంధువుగా మారారు. ఉమ్మడి జిల్లాలో పెద్దాసుపత్రులు, డివిజన్ కేంద్రాల్లో, నియోజకవర్గ కేంద్రాల్లో ఏరియా దవాఖానలు ఉన్నా సౌలత్‌లు అంతంత మాత్రమే.. కానీ తెలంగాణ ఏర్పడ్డాక దవాఖానల రూపురేఖలు మారిపోయాయి. కార్పొరేట్ స్థాయిలో దవాఖానలను నిర్మిస్తున్నది. అడిగిన వెంటనే దవాఖానలు మంజూరు చేస్తూ పల్లెల్లో వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో మంత్రి హరీశ్‌రావు పనిచేస్తున్నారు. భవిష్యత్‌లో ఉమ్మడి జిల్లాలో దవాఖానలు లేని మండలమే కనిపించక మానదు. కొత్త జిల్లాలను ఏర్పాటు చేసి జిల్లాకో మెడికల్ కాలేజీ ఇచ్చి దానికి అనుబంధంగా కార్పొరేట్ స్థాయిలో పెద్ద దవాఖానలు నిర్మిస్తున్నారు. భవిష్యత్‌లో ఉమ్మడి జిల్లాలో ప్రైవేటు వైద్యశాలలు మూతపడుడు ఖాయంగా కనిపిస్తుంది.

### నేడు మంత్రి హరీశ్‌రావు పర్యటన

ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం మంత్రి హరీశ్‌రావు పర్యటించనున్నారు. నారాయణపేట, వనపర్తి జిల్లాల్లోని మూడు నియోజకవర్గాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు , ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఈమేరకు ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, అధికార యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేసింది. రూ.కోట్లతో పనులకు మంత్రులు హరీశ్‌రావు,సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభోత్సవాలు చేయనున్నారు. మక్తల్‌లో 150 పడకలు, దేవరకద్రలో వంద పడకలు, కొత్తకోటలో 30 పడకలు స్థాయిలో కొత్తగా నిర్మించే దవాఖాన భవనాలకు శంకుస్థాపనలు చేయనున్నారు. కోస్గిలో వంద పడకల దవాఖానను ప్రారంభించనున్నారు. ఉదయం 10 గంటలకు మంత్రి హరీశ్‌రావు హెలీకాప్టర్‌లో కోస్గి పట్టణానికి చేరుకుంటారు. అక్కడ కార్యక్రమాలు ముగించుకొని అదే హెలీకాప్టర్‌లో మక్తల్ చేరుకుని అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నారు. మక్తల్ నుంచి కొత్తకోటకు హెలీకాప్టర్‌లో చేరుకొని రోడ్డు మార్గం మీదుగా మదనాపురం మండల కేంద్రానికి చేరుకుంటారు. అక్కడ డబుల్ బెడ్రూం ఇండ్లను ప్రారంభించి కొత్తకోటలో జరిగే భారీ బహిరంగ సభలో పాల్గొననున్నారు. మంత్రులు హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ పర్యటన విపక్షాల్లో దడ పుట్టిస్తుంది.

### మక్తల్‌లో 150 పడకల దవాఖానకు శ్రీకారం

స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి కర్ణాటకకు ఆనుకుని ఉన్న మక్తల్ నియోజవకవర్గంలో దవాఖానలు ఉండేవి కావు. దీంతో ఎవరికైనా వైద్య సేవలు అవసరమైతే ఇటు హైదరాబాద్‌కో.. లేదా అటు రాయిచూర్‌కు వెళ్లే పరిస్థితి నాటిది.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత మక్తల్‌లో ఉన్న ప్రభుత్వ దవాఖాను మెరుగుపర్చి అనేక సౌలత్‌లు కల్పించారు. ఆధునిక వసతులు కల్పించి పాతబడిన భవనానికి తుదిమెరుగులు దిద్దారు. కర్నిలో ఉన్న పీహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేసి వైద్య సదుపాయలను అందుబాటులోకి తీసుకొచ్చారు. తాజాగా రూ.35 కోట్లతో నియోజకవర్గ కేంద్రంలో 150 పడకల దవాఖానను మంత్రి హరీశ్‌రావు మంజూరు చేశారు. దీంతో బీసీ కాలనీ సమీపంలోని ప్రభుత్వ స్థలంలో కొత్త దవాఖాన నిర్మించబోతున్నారు. భవనం పనులు పూర్తయితే ఇక్కడి ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి చొరవతో సుమారు రూ.90 కోట్లతో వివిధ ప్రగతి పనులకు శ్రీకారం చుడుతున్నారు. రూ.6 కోట్లతో నిర్మించిన నాలుగు విద్యుత్ సబ్‌స్టేషన్లను, కృష్ణ మండల కేంద్రంలో రూ.2.5 కోట్లతో నిర్మించనున్న కేజీబీవీ జూనియర్ కాలేజీకి రూ.5 కోట్లతో నిర్మించిన ఊట్కూర్, నర్వ కేజీబీవీ పాఠశాలలను ప్రారంభించనున్నారు. రూ.6 కోట్లతో నిర్మించిన వేర్‌హౌసింగ్ గోదాములను, రూ.70 లక్షలతో నిర్మించిన మార్కెట్ కార్యాలయం భవనాన్ని ప్రారంభిస్తారు. రూ.15 కోట్ల సీఎం ప్రత్యేక నిధులతో చేపట్టిన పనులను, మున్సిపాలిటీలో రూ.15 కోట్ల టీఎఫ్ఐడీసీ పనులను ప్రారంభిస్తారు. రూ.6 కోట్లతో మక్తల్‌లో నిర్మించే డిగ్రీ కాలేజీ భవనానికి శంకుస్థాపన చేస్తున్నారు. అనంతరం సభలో ప్రసంగించనున్నారు.

### కొత్తకోటలో భారీ బైక్ ర్యాలీకి ఏర్పాట్లు

మంత్రి హరీశ్‌రావుకు ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. కొత్తకోటలో దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ చేపట్టేందుకు సన్నాహాలు చేశారు. పట్టణంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్న మంత్రులకు నీరాజనం పలికేందుకు గులాబీ శ్రేణులు సిద్ధమయ్యాయి. దేవరకద్రకు వంద పడకలు, కొత్తకోటలో 30 పడకల దవాఖాన నిర్మాణానికి ఉమ్మడి జిల్లా మంత్రులతో కలిసి ఆయన శంకుస్థాపనలు చేయనున్నారు. మదనాపురంలో 136 డబుల్ బెడ్రూం ఇండ్లను లబ్ధిదారులకే అందించనున్నారు. అనంతరం కొత్తకోటలో బహిరంగ సభలో మాట్లాడనున్నారు. ముందుగా కోస్గిలో 50 పడకల దవాఖాన భవనం ప్రారంభంతోపాటు పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. ఈ పర్యటనను విజయవంతం చేసేందుకు బీఆర్‌ఎస్ శ్రేణులు, అధికారులు సిద్ధమయ్యారు. 2018 ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలన్నీ నెరవేర్చడంతో మంత్రి హరీశ్‌రావు పర్యటన ప్రాధాన్యత సంతరించుకున్నది. గతంలో కొడంగల్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించి ప్రజాసమస్యలు గాలికోదిలేసిన రేవంత్‌కు ఈ సభతో చెక్ పెట్టే అవకాశం ఉన్నది. మంత్రి సుడిగాలి పర్యటనతో కాంగ్రెస్, బీజేపీల్లో గుబులు మొదలైంది.



మక్తల్‌లో సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

### మంత్రి హరీశ్‌రావు పర్యటన షెడ్యూల్

ఉదయం 10:20 గంటలకు కోస్గిలో 50 పడకల దవాఖానకు శ్రీకారం. అంబేద్కర్, ముదిరాజ్ భవనాలకు శంకుస్థాపన. అనంతరం కోస్గి జూనియర్ కళాశాల మైదానంలో బహిరంగ సభ

- 11:15 గంటలకు మక్తల్ 150 పడకల దవాఖాన భవన నిర్మాణానికి శంకుస్థాపన
- కృష్ణ మండలంలో ఫైర్ స్టేషన్, పీహెచ్‌సీ, ఏఎంసీ కార్యాలయం ప్రారంభం.
- వేర్‌హౌస్ బిల్డింగ్, రెండు కేజీబీవీల భవన నిర్మాణానికి శంకుస్థాపన
- గుడిగండ్ల, కర్నెలో 33/11 కేవీ సబ్‌స్టేషన్లకు శంకుస్థాపన
- మక్తల్ సమీపంలోని పంప్‌హౌస్ వద్ద బహిరంగ సభ
- 2:30 కొత్తకోటలో రోడ్‌షో. కొత్తకోటలో 30 పడకల సీహెచ్‌సీ దవాఖాన నిర్మాణానికి శంకుస్థాపన.
- మదనాపురంలో 136 డబుల్‌బెడ్రూం ఇండ్ల ప్రారంభం
- ధోబీఘాటు, కమ్యూనిటీహాళ్లు, బీటీ, సీసీ రోడ్లకు శంకుస్థాపన. అనంతరం బహిరంగ సభ. అనంతరం తిరుగు ప్రయాణం

### మంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు..

మక్తల్ టౌన్/కోస్గి, అక్టోబర్ 3 : మక్తల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవానికి హాజరవుతున్న వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మంత్రి పర్యటనకు సంబంధించి ఏర్పాట్లు పరిశీలించి అధికారులతో మాట్లాడారు. సభావేదికను అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ పరిశీలించారు. అలాగే కోస్గి మండలంలో మంత్రి తన్నీరు హరీశ్‌రావు పర్యటన సందర్భంగా కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ వనజ బుధవారం ఏర్పాట్లను పరిశీలించారు.




కోస్గిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

### డబుల్ బెడ్రూంలు..

పేదలు ఆత్మగౌరవంతో జీవించాలనే తపనతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన డబల్‌బెడ్రూం గృహనిర్మాణ పథకం కింద నియోజకవర్గంలోని 7మండలాల్లో మొదటిదశలో రూ.145.82కోట్లతో 2,825 డబల్‌బెడ్రూం ఇండ్ల నిర్మాణం చేపట్టారు. రెండో దశలో మరో 3వేల డబల్‌బెడ్రూం ఇండ్లు మంజూరై నిర్మాణం చేస్తున్నారు.

# నీళ్ల నిరంజనుడు

- ప్రజలను గెలిపించిన నాయకుడు
- నేడు మంత్రి నిరంజన్‌రెడ్డి జన్మదినం



వనపర్తి, అక్టోబర్ 3 : పదేండ్ల ప్రస్థానంలో నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలుపాలన్న లక్ష్యంతో సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారు. 2014లో స్వల్ప మెజార్టీతో ఓడినా సీఎం కేసీఆర్ ఆశీస్సులతో ఎడారిగా ఉన్న వనపర్తి జిల్లాను సాగునీటితో సస్యశ్యామలం చేసి తన పేరును నీళ్ల నిరంజన్‌రెడ్డిగా ప్రజలచేత సాకారం చేసుకున్న జననేత నిరంజన్‌రెడ్డి.

### విద్యాహబ్..

వనపర్తికి మొదటి నుంచి విద్యాపర్తిగా పేరుంది. దానికి కొనసాగింపుగా మంత్రి నిరంజన్‌రెడ్డి జిల్లా ఏర్పాటుతో రూ.550కోట్లతో 50 ఎకరాల్లో మెడికల్ కళాశాల, రూ.40కోట్లతో 45 ఎకరాల్లో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల జిల్లా పరిధిలోని పెబ్బేరులో ఉమ్మడి రాష్ట్రంలోనే సీఎం కేసీఆర్ చొరవతో రాష్ట్రంలోనే మొట్ట మొదటి మత్స్య కళాశాలను ఏర్పాటు చేసుకోవడం జరిగింది. దీని కోసం కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో 65 ఎకరాల్లో రూ.65కోట్లతో కళాశాల నిర్మాణం చేపట్టారు. అలాగే బీసీ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలతోపాటు మరిన్ని ఉన్నత కళాశాలలను జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసుకోవడం జరిగింది.

### చెరువులకు పునర్జీవం..

పట్టణ కేంద్రంలోని తాళ్ల చెరువు, నల్ల చెరువు, రాజనగరం అమ్మ చెరువు, లక్ష్మీకుంట చెరువులు కబ్జాకోరల్లో చిక్కుకోగా, వాటికి పునర్జీవాన్ని పోశారు. 440 ఎకరాల ఆయకట్టు సాగయ్యే ఈ చెరువులు ఇవాళ మినీ ట్యాంక్‌బండ్లుగా మార్చారు. కట్ట పొడవునా ఎల్ఈడీ లైట్లు, సేద తీరేందుకు బెంచీలు, ఇతర సౌకర్యాలతో నగర వాసులకు ఆహ్లాదాన్ని అందించారు. పదేండ్ల ప్రయాణంలో అనేక సంక్షేమ పథకాలతో నియోజకవర్గాన్ని రాష్ట్ర స్థాయిలో ప్రథమంగా నిలిపేందుకు రూ.10కోట్లతో టీహబ్, రూ.450కోట్లతో పెద్దమందడి మండలంలో వనపర్తి పట్టణ ప్రజలకు సాగునీటి ఎద్దడితీర్చేందుకు మిషన్ భగీరథ సంప్ ఏర్పాటుకు భగీరథ ప్రయత్నం చేసిన ఘనత నీళ్ల నిరంజన్‌రెడ్డికే దక్కుతుంది.

### రోడ్ల విస్తరణకు మోక్షం..

ఎన్నోయేండ్లుగా వనపర్తి ప్రజల చిరకాల కోరికగా మిగిలిన రోడ్ల విస్తరణను మంత్రి నిరంజన్‌రెడ్డి చొరవతో రూ.49.50కోట్లతో శరవేగంగా పనులను చేపడుతున్నారు. అలాగే వనపర్తి పెబ్బేరు రోడ్లను మర్రికుంట వద్ద ఏర్పాటు చేసే బైపాస్‌రోడ్డుతో వనపర్తి జిల్లా కేంద్రం రూపురేఖలే మారనున్నాయి.

### ప్రజలకు చేరువైన వైద్యం..

జిల్లాల ఏర్పాటుతో వైద్య ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ నర్సింగాయపల్లి శివారులో రూ.17కోట్లతో 100పడకల మాతాశిశు ఆరోగ్య కేంద్రం నిర్మాణం, 100 పడకల దవాఖానను 300పడకలుగా అప్‌గ్రేడ్ చేయడం, మెడికల్ కళాశాల సమీపంలో 600 పడకల దవాఖాన నిర్మాణం కూడా చేపడుతున్నారు. వనపర్తి ఏరియా దవాఖానను రూ.5.75కోట్లతో ఆధునీకరించారు. రూ.16కోట్లతో క్రిటికల్ కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. 10 డయాలసీస్ బెడ్లు, చిన్నపిల్లల కోసం పది ప్రత్యేక బెడ్లు, పిల్లల కోసం 20 బెడ్లు, 30 ఐసీయూ బెడ్లను ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. స్థానికంగా డ్రగ్‌స్టోర్, డయాగ్నొస్టిక్ హబ్ అందుబాటులోకి తెచ్చారు. జిల్లాలోని కంటి వెలుగు కార్యక్రమం ద్వారా ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కంటి అద్దాలు అందించారు.




వనపర్తిలోని మినీ ట్యాంక్‌బండ్

### మారిన మార్కెట్ రూపురేఖలు..

జిల్లాలో అధునాతనమైన నూతన వ్యవసాయ మార్కెట్‌యార్డును రూ.44కోట్లతో 43 ఎకరాల్లో నిర్మాణం చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఉత్పత్తులను విక్రయించేలా ఏర్పాటు చేశారు. అదేవిధంగా రైతులు పండించిన ధాన్యం నిల్వ కేంద్రం ఏర్పాటు వేర్‌హౌసింగ్ గోదాంలు చిట్యాల, ఘనపురం, శ్రీరంగాపురం, రేవల్లి, పెబ్బేరు, పెద్దమందడి మండలాల్లో రూ.58.40కోట్లతో 58.700టన్నుల సామర్థ్యం గల గోదాంలు నిర్మించారు. మార్కెట్‌కు వచ్చే ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో అన్ని రకాల సౌకర్యాలు కల్పించేలా వేసైడ్ మార్కెట్‌ను రూ.3.40కోట్లతో 51వేల చదరపు అడుగుల విస్తీర్ణంతో నిర్మించారు. ఒకేసారి 20వేల మంది రైతులు 30గ్రామాల ప్రజలు దీనిద్వారా లబ్ధి పొందనున్నారు. ఈ మార్కెట్‌లో వ్యవసాయ ఉత్పత్తులను రైతులు విక్రయించుకునేందుకు 78 ప్లాట్‌ఫాంలు, షెడ్లను ఏర్పాటు చేశారు. అలాగే వీధి వ్యాపారస్తుల కోసం పట్టణంలోని నడిబొడ్డులో సమీకృత మార్కెట్ భవనాన్ని ఏర్పాటు చేశారు.

### నియోజకవర్గం జిల్లాగా ఏర్పాటు..

రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనను మరింత చేరువ చేయాలనే సంకల్పంతో జిల్లా ఏర్పాటులో వనపర్తిని కూడా జిల్లాగా చేసేందుకు మంత్రి నిరంజన్‌రెడ్డి భగీరథ ప్రయత్నం చేశారు. అందులో భాగంగా జిల్లా కేంద్రంలో 25 ఎకరాల్లో రూ.62కోట్లతో 34 ప్రధాన ప్రభుత్వ విభాగాల భవనాలను ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఎస్పీ కార్యాలయం భవనాన్ని 29 ఎకరాల్లో రూ.38.50కోట్లతో రాజ భవనం రీతిలో నిర్మించారు.

### నిండుకుండలా రిజర్వాయర్లు..

నియోజకవర్గంలోని ఏదుల, ఘణపూర్, గోపాల్‌పేటలలో ప్రతిష్టాత్మకంగా రిజర్వాయర్లను ఏర్పాటు చేసి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేశారు. మొదటగా ఏదుల వీరాంజనేయ రిజర్వాయర్‌ను 145 మెగావాట్ల సామర్థ్యంతో రోజుకు 2 టీఎంసీల కృష్ణానీళ్లను ఎత్తిపోయనున్న పది పంపులతో శ్రీకారం చుట్టారు. కేవలం ఏడాదిన్నరలో రూ.700కోట్లతో ఈ రిజర్వాయర్‌ను నిర్మించారు. పెద్దమందడి, ఘణపూర్, వనపర్తి మండలాల్లోని కల్వకుర్తి లిఫ్టు ఇరిగేషన్‌కు సంబంధించి 40వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ చేశారు. ఆసియాలోనే అతిపెద్ద మోటర్లు, సర్జ్‌పూల్ ఇక్కడే ఉన్నాయి. ఈ రిజర్వాయర్ నిల్వ సామర్థ్యం 6.5 టీఎంసీలుగా నిలిచింది. అలాగే 800 ఏండ్ల కింద కాకతీయ కాలంలో నిర్మించిన గణపసముద్రాన్ని రూ.55కోట్లతో రిజర్వాయర్‌గా సీఎం కేసీఆర్ ఆశీస్సులతో తీర్చిదిద్దబోతున్నారు. అదేవిధంగా మరో రిజర్వాయర్‌కు రూ.42.2కోట్లతో బుద్దారం చెరువును బ్రాంచి కెనాల్ ద్వారా కృష్ణాజలాలతో నింపి మత్తడి దూకించారు. రూ.77కోట్లతో కర్నెతాండ లిఫ్టు పనులను ప్రారంభించారు. 43.25 క్యూసెక్కుల వినియోగమే లక్ష్యంగా 4,325 ఎకరాలకు నీళ్లందించేలా మెట్ట ప్రాంతాలైన లట్టుపల్లి, షాపూర్, జంగమాయపల్లి, కెనాల్స్ ద్వారా ఐదు గ్రామాలు, 16తండాలు, సుమారు 20చెరువుల్లోకి నీళ్లు చేరేలా లిఫ్టును చేపట్టారు. జిల్లాలో 12 చెక్‌డ్యాంల నిర్మాణంతో భూగర్భజలాలు పెరిగాయి. వనపర్తి నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో 64 మినీ లిఫ్టులు ఏర్పాటు చేశారు.



ఎస్పీ కార్యాలయం

# అన్నగా గర్వపడుతున్నా..

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి
- గద్వాలలో 500 మంది గర్భిణులకు సీమంతం

గద్వాల, అక్టోబర్ 3 : 'సాధారణంగా గర్భిణికి సీమంతం చేయడానికి తల్లిగారింటికి తీసుకెళ్తారు.. కానీ చాలామంది పేదవాళ్లు తమ కూతుళ్లకు ఈ కార్యం చేయరు.. గద్వాల నియోజకవర్గంలో ఉన్న గర్భిణులకు ఓ అన్నగా సీమంతం చేయడం నాతోపాటు నాభార్య జన్మ ధన్యమైంది' అని గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, ఆయన సతీమణి జ్యోతి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో 500 మంది గర్భిణులకు సీమంతం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో సరైన వైద్యం అందక గ్రామాల్లో నివసించే గర్భిణులు నానా అవస్థలు పడేవారని గుర్తు చేశారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమ్మాయి పుట్టినప్పుడు కేసీఆర్ కిట్‌తో మొదలై చదువు కోసం గురుకులాలు, పెండ్లికి షాదీ ముబారక్, గర్భం దాల్చితే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండేందుకు న్యూట్రిషన్ కిట్ ఇలా ఎన్నో సదుపాయాలను సీఎం కేసీఆర్ అందుబాటులో ఉంచారన్నారు. గర్భిణులకు సీమంతం చేస్తున్నందుకు ఓ అన్నగా గర్వపడుతున్నారు. మహిళా భద్రత కోసం ప్రభుత్వం షీటీం ఏర్పాటు చేసిందన్నారు. గతంలో ప్రభుత్వ దవాఖానలపై నమ్మకం లేక ప్రైవేట్ దవాఖానకు వెళ్లి డబ్బు ఖర్చు చేసేవారని, నేడు సర్కారు దవాఖానల్లోనే 80 శాతానికి పైగా ప్రసవాలు జరుగుతున్నాయని, అందుకు ప్రభుత్వం సమకూర్చిన సౌకర్యాలే కారణమని వివరించారు. ప్రస్తుతం పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఎమ్మెల్యే సతీమణి జ్యోతి తెలిపారు. ఇటీవల కేంద్రం మహిళలకు 33శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రకటించడం హర్షణీయమన్నారు. మహిళలు ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్‌నాయుడు, మహిళా నాయకురాళ్లు రాధ, రాధమ్మ, ఇందిరమ్మ, అంగన్‌వాటీచర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి దంపతులు

# జలసంబురం

- నల్లమల కొండలను ముద్దాడిన పాలమూరు
- నీటితో కళ కళ లాడుతున్న అంజనగిరి రిజర్వాయర్



నల్లమల కొండల మధ్య నిర్మించిన అంజనగిరి రిజర్వాయర్‌లోకి చేరిన కృష్ణానది జలాలు

కొల్లాపూర్, అక్టోబర్ 3 : పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నార్లాపూర్(అంజనగిరి) రిజర్వాయర్‌లోకి 1.5 టీఎంసీల నీరు చేరడంతో జలసంబురం సంతరించుకున్నది. రెండు నల్లమల కొండలను కలుపుతూ చుట్టూ 2,224 ఎకరాల విస్తీర్ణంలో 11.02 కిలోమీటర్ల పొడవు, 74 మీటర్ల ఎత్తు, 8.41 టీఎంసీల నీటి నిల్వ సామర్థంతో రిజర్వాయర్ బండ్ రూపుదిద్దుకున్నది. దీంతో సోమవారం మధ్యాహ్నం వరకు అంజనగిరి రిజర్వాయర్‌లోకి 1.5 టీఎంసీల కృష్ణానది జలాలను ఒక మోటర్‌తో ఎత్తిపోసింది. సోమవారం మధ్యాహ్నం వరకు నడిపించి మోటరును ఆపేశారు. చుట్టూ పచ్చని నల్లమల కొండల మధ్య కృష్ణమ్మ జలాలతో పరవళ్లు తొక్కుతున్నది. మొలచింతపల్లికి వెళ్లే బైపాస్ రోడ్డుపై నుంచి ఎటూ చూసిన కనుచూపు మేరలో అంజనగిరి రిజర్వాయర్ జలాలు ఆకాశంతో కలిసిపోయిన విధంగా కన్పిస్తున్నయి. ఇదిలా ఉండగా, నీటి డెలివరీ సిస్టర్న్ వద్ద నీటి ప్రవాహానికి ఒక పక్క మట్టి గోడ కోతకు గురికావడంతో మంగళవారం తాపీ కార్మికులు సిమెంట్‌తో కాంక్రీట్ పనులు చేపడుతున్నారు.

# బీఆర్‌ఎస్‌లోకి క్యూట్టిన జూపల్లి వర్గీయులు

- ఎమ్మెల్యే బీరం సమక్షంలో 220 మంది చేరిక



బీఆర్‌ఎస్‌లో చేరిన జూపల్లి వర్గీయులతో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్, అక్టోబర్ 3 : కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లోకి మాజీ మంత్రి జూపల్లి వర్గీయులు వరుసగా క్యూకట్టారు. మంగళవారం కొల్లాపూర్, పెద్దకొత్తపల్లి మండలాలకు చెందిన జూపల్లి వర్గీయులు సుమారు 220 మంది కార్యకర్తలు హస్తం పార్టీని వీడి కారెక్కారు. పెద్దకొత్తపల్లి మండలం బాచారంలో 150 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. మారెడుమాన్‌దిన్నె గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఐదు రోజుల కిందట కాంగ్రెస్‌లోకి వెళ్లి, తిరిగి 50మంది తాజాగా బీఆర్‌ఎస్‌లో ఎమ్మెల్యే సమక్షంలో సాతాపూర్‌లో చేరారు. కొల్లాపూర్ మండలం మాధవరావుపేట, మాచినేనిపల్లి గ్రామానికి చెందిన జూపల్లి వర్గీయులు 20మంది పట్టణంలోని ఎమ్మెల్యే బీరం ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి గులాబీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్రం సుభిక్షంగా ముందుకు సాగుతున్నదన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీరం హర్షవర్ధన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తామని పార్టీలో చేరిన వారు పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారిలో మద్దిలేటి, కిష్టయ్య, చిన్నకుర్మయ్య, మల్లేశ్, వెంకటేశ్, రాముడు, సత్యంయాదవ్, గొల్ల వెంకటస్వామి, తిరుపతయ్య, బాలు, సంగెం, కుర్మయ్య, జంబులమ్మ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లారెడ్డి, నరసింహారావు, సురేందర్, వెంకటకృష్టారెడ్డి, ఉపసర్పంచ్ శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ తిరుపతయ్య, తిరుపతయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నేనూఒకప్పుడు ఉపాధ్యాయుడినే..

- ఉన్నత లక్ష్యాలు సాధిస్తేనే ఉజ్వల భవిష్యత్
- నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

నారాయణపేట, అక్టోబర్ 3 : నేనూ ఒకప్పుడు ఉపాధ్యాయుడినేనని.. పదో తరగతిలో తక్కువ మార్కులొచ్చినప్పటికీ.. పట్టువిడువకుండా చదివి ఈ స్థాయికి చేరినట్లు ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నారాయణపేట పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో బీఆర్‌ఎస్ నియోజకవర్గ యువ అధ్యక్షుడు శ్రీపాద్ అధ్యక్షతన ఎస్ఆర్ రెడ్డి యువ ఉద్యోగ యాప్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మన ఉద్యోగాలు మనకే వస్తున్నాయన్నారు. ఇందుకోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించి రాష్ట్రపతితో ప్రత్యేక ఉత్తర్వులు తీసుకువచ్చారన్నారు. పిల్లలను చదువుకోవడానికి మోటివేట్ చేయడమే ఉపాధ్యాయుల విధి అన్నారు. తాను కూడా ఎనిమిదేండ్ల పాటు ఉపాధ్యాయ వృత్తిని చేపట్టడం జరిగిందన్నారు. పదో తరగతిలో 47శాతం మార్కులు వచ్చాయని, నేడు ఎమ్మెల్యేగా, 18 విద్యాసంస్థలకు అధిపతిగా, ప్రతి ఏడాది 230 మంది డాక్టర్లను తయారు చేసే విద్యాసంస్థను నడిపిస్తున్నానన్నారు. 16 దేశాలకు చెందిన విద్యార్థులు తన కళాశాలలో చదువుతున్నట్లు చెప్పారు. 47 శాతం మార్కులు వచ్చిన రాజేందర్‌రెడ్డి నేడు ఇంత ఎత్తుకు ఎదిగినప్పుడు 80-90 శాతం మార్కులు సాధించిన మీలాంటి ఎంతో మంది విద్యార్థులు మరింత అద్భుతాలు సృష్టించవచ్చో అర్థం చేసుకోవాలన్నారు. ఇంటర్నెట్‌ను మేథస్సు పెంచుకోవడానికి ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అనసూయ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి, జెడ్పీటీసీ అంజలి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రంగారెడ్డి, యాప్ నిర్వాహకులు చక్రవర్తి, ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపళ్లు పద్మ, శేషమ్మ, రామకృష్ణ, కౌన్సిలర్లు గురులింగం, మహేశ్, బీఆర్‌ఎస్ నాయకులు విజయ్‌సాగర్, ప్రతాప్‌రెడ్డి, జగదీశ్, చెన్నారెడ్డి, చంద్రకాంత్, సుదర్శన్‌రెడ్డి, శివరాంరెడ్డి, కార్తీక్ పాల్గొన్నారు.



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి